నిబంధనలు హుళక్కేనా?

- అనధికార లే అవుట్‌లలో ప్రభుత్వ నిధులతో మౌలిక వసతులు
- ప్రజల సొమ్ముతో రోడ్ల నిర్మాణం
- జీఓ ఎంఎస్ నంబర్ 10కి మంగళం



ఉయ్యూరు కాటూరు రోడ్డులోని అనధికార లే అవుట్‌లో రూ.40 లక్షలతో నిర్మించిన తారురోడ్డు

ఉయ్యూరు: ఉయ్యూరు పట్టణంలో నిబంధనలు గాలికొదిలేస్తున్నారు. స్వలాభమే అజెండాగా పనులకు పచ్చజెండా ఊపుతున్నారు. అనధికార లే అవుట్‌లలో మౌలిక వసతుల కల్పన పేరుతో రహదారుల నిర్మాణం, డ్రెయినేజీలు, విద్యుదీకరణ పనులు కల్పిస్తూ జీఓ ఎంఎస్ నంబరు 10కి మంగళం పాడేశారు. లోకాయుక్త ఆదేశాలను సైతం ఖాతరు చేయకుండా చేస్తున్న పనులపై లోగుట్టు పెరుమాళ్లకే ఎరుక.

చెత్త బుట్టలోకి జీఓలు

మున్సిపాలిటీలో జీఓలు చెత్తబుట్టకు పరిమితం అవుతున్నాయి. ప్రధానంగా అనధికార లే అవుట్‌లకు సంబంధించి ఉల్లంఘనలకు పాల్పడుతున్నారు. రియల్టర్లు, వ్యాపారులతో అధికారులు కుమ్మక్కై అడ్డగోలు పనులకు గ్రీన్‌సిగ్నల్ ఇస్తున్నా పాలకవర్గం చోద్యం చూస్తుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణంలోని కాటూరు రోడ్డులో ఓ అనధికార లే అవుట్‌లో తాజాగా రూ.40 లక్షలు అంచనా వ్యయంతో తారురోడ్డు నిర్మాణం చేపట్టారు. పలు వార్డుల్లోనూ లే అవుట్‌లకు అనుసంధానంగా రోడ్లు నిర్మిస్తూ రియల్టర్ల ప్రయోజనాలు కాపాడుతున్నారు. ఇంత జరుగుతున్నా సీఆర్‌డీఏ, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ అధికారులు తమకేమీ తెలియనట్టే నటించటం కొసమెరుపు.

లోకాయుక్తలో విచారణ

పట్టణంలోని కాటూరు రోడ్డులో 588, 591, 604/2, 589 (పీ), 593/3, 604/1లకు సంబంధించి అనధికార లే అవుట్‌పై లోకాయుక్తలో విచారణ జరుగుతుంది. ఆయా సర్వే నంబర్లలోని భూముల్లో ఎలాంటి అనుమతులు లేకుండా అనధికార వెంచరు వేశారు. వ్యాపార సముదాయాలు, భవనాలు నిర్మించారు. ఈ లే అవుట్‌పై చర్యలు తీసుకుని ప్రజాధనాన్ని కాపాడాలని సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ లోకాయుక్తను ఆశ్రయించారు. లే అవుట్‌లో పూర్తిగా నిబంధనలు ఉల్లంఘించటంతో పాటు ప్రభుత్వ ఖజానాకు రావాల్సిన ఆదాయం ప్రైవేటు వ్యక్తుల పరమైందనే వాదనను లోకాయుక్త దృష్టికి తీసుకెళ్లారు. ఈ వ్యవహారంపై లోకాయుక్త విచారణకు ఆదేశించింది. గత కొన్ని నెలల క్రితం లోకాయుక్త డీఎస్పీ అనధికార లే అవుట్, భవనాలను పరిశీలించి, మున్సిపల్ రికార్డులను తనిఖీచేసి సమగ్ర నివేదికను లోకాయుక్త ముందుంచారు. లోకాయుక్త ఆదేశాలు జారీ చేయక ముందే మున్సిపల్ అధికారులు రియల్టరుకు అనుకూలంగా రూ.40 లక్షలతో తారురోడ్డు నిర్మించి పూర్తి చేసింది.

మళ్లీ లోకాయుక్తకు ఫిర్యాదుచేస్తా

జీఓ ఎంఎస్ నంబరు 10 ప్రకారం అనధికార లే అవుట్‌లలో మౌలిక వసతులు కల్పించకూడదు. భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకూడదు. కాటూరురోడ్డులోని అనధికార లే అవుట్‌పై లోకాయుక్తకు ఫిర్యాదుచేశాం. లోకాయుక్త ఆదేశాల మేరకు విచారణ పూర్తయ్యింది. నిబంధనల ఉల్లంఘన జరగటంపై మరోమారు ఫిర్యాదు చేస్తా.

– జంపాన శ్రీనివాసగౌడ్, సామాజిక కార్యకర్త

మౌలిక వసతులు కల్పించొచ్చు

అనధికార లే అవుట్‌లలో రోడ్లు, ఇతర సౌకర్యాలు కల్పించరాదు. అయితే అనధికార లేఅవుట్‌లలో భవనాలు నిర్మించుకుని మున్సిపాలిటీకి 14 శాతం ఫీజు చెల్లిస్తే మౌలిక వసతులు కల్పించవచ్చు. కాటూరు రోడ్డులోని లే అవుట్‌లో ఓ యజమాని సీఆర్‌డీఏ అనుమతి పొందారు. మరికొందరు ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేశారు. ఈ అంశాన్ని సీఆర్‌డీఏ, ఉన్నతాధికారుల దృష్టిలో ఉంచుతాను.

– ఆశ, టౌన్‌ప్లానింగ్‌అధికారి

క్లుప్తంగా

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధి పోరంకి శ్రీనివాసానగర్‌లో అంతర్గత సీసీ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే బోడె ప్రసాద్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రసాద్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో అంతర్గత రహదారులపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. దశలవారీగా పనులు చేపట్టి పూర్తి చేస్తామని తెలిపారు. పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు, స్థానికులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెనమలూరు: పోరంకిలో విద్యుత్ సరఫరాకు శనివారం అంతరాయం ఉంటుందని ఈఈ ఆపరేషన్స్ పి.హరిబాబు తెలిపారు. ఆయన శుక్రవారం వివరాలు వెల్లడించారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఈ కారణంగా పోరంకి సెంటర్, ఎమ్మెల్యే కార్యాలయం రోడ్డు, ప్రభునగర్, నిడమానూరు రోడ్డు, శివాలయం సెంటర్, బందరు రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. స్థానికులు తమ సిబ్బందితో సహకరించాలని కోరారు.

ప్రతి ఇంటికీ రాఖీలు పంపిణీ చేస్తాం



పెనమలూరు: సమరతసేవా ఫౌండేషన్‌తో హిందూ ధర్మ ప్రచారం విస్తృతంగా చేపడతామని సంస్థ ప్రతినిధి శ్రీనివాసరావు తెలిపారు. చోడవరం గ్రామంలో శుక్రవారం సమరతసేవా ఫౌండేషన్ (ఎస్ఎస్ఎఫ్) కృష్ణా జిల్లా కన్వీనర్ల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో 50 మంది కన్వీనర్లు సమావేశంలో పాల్గొన్నారని తెలిపారు. శ్రావణపౌర్ణమి సందర్భంగా ప్రతి ఇంటికీ రాఖీలు పంపిణీ చేసి సోదర భావం పెంపొందిస్తామన్నారు. హిందూ ధర్మ ప్రచారం నిమిత్తం లక్ష్మి కుంకుమ పూజలు చేయిస్తామని తెలిపారు. టీటీడీ ఆర్థిక సాయంతో 23 దేవాలయాలు నిర్మాణం చేశామని, 5 కేంద్రాలలో పాఠశాలలు నిర్వహిస్తున్నామని వివరించారు. ధర్మప్రచారకులు భూపతి, జైశంకర్, తులసీకృష్ణ, రామాంజనేయులు, సభ్యులు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

కంకిపాడు: అంగన్‌వాడీ కార్యకర్తపై దాడి చేసిన సంఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో బాలుడిపై శుక్రవారం కేసునమోదైంది. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు.. ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త సంయుక్తరాణి కంకిపాడులోని విష్ణాలయం సమీపంలో నివాసం ఉంటోంది. ఆమె ఉంటున్న ఇంటికి పక్క పోర్షన్‌లో వ్యక్తికి స్నేహితుడైన బాలుడు మద్యం తాగి అంగన్‌వాడీ కార్యకర్తపై దాడి చేశాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బాలుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రెడీమేడ్ వస్త్ర దుకాణం ప్రారంభం



పెనమలూరు: కానూరు అశోక్‌నగర్‌లో ముంబైకి చెందిన అతి పెద్ద రెడీమేడ్ వస్త్రాల 'స్టైల్ యూనియన్ స్టోర్'ను ఎమ్మెల్యే బోడె ప్రసాద్, ఇండ్లాస్ ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డితో కలిసి శుక్రవారం ప్రారంభించారు. స్టోర్ యాజమాన్యం వివరాలు తెలుపుతూ యువతకు, పిల్లలకు అత్యాధునిక డిజైన్‌లతో నూతన స్టాక్ అందుబాటులో ఉంచుతామన్నారు. ఇక్కడ అన్నిరకాల ఫ్యాషన్ వస్త్రాలు అందుబాటులో ఉంటాయని వివరించారు.

న్యాయవాదుల పరిరక్షణ చట్టం చేయాలి

విజయవాడలీగల్: రాష్ట్రంలో న్యాయవాదుల పరిరక్షణ చట్టం చేయాలని, న్యాయస్థానంలో ఖాళీగా ఉన్న న్యాయమూర్తులు, పబ్లిక్ ప్రాసిక్యూషన్ పోస్టులు భర్తీ చేయాలని కోరుతూ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం సివిల్ కోర్టుల ఎదుట నిరసన ధర్నా చేపట్టారు. ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నూతన కోర్టు భవనాలు నిర్మించాలని కోరారు. న్యాయమూర్తుల సంక్షేమ నిధి రూ. 6 నుంచి రూ. 10 లక్షలకు పెంచాలని, మరణించిన న్యాయవాదుల కుటుంబాలకు మ్యాచింగ్ గ్రాంటు బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ బాషా సంఘీభావం తెలిపారు. ఐఏఎల్ ఉప ప్రధాన కార్యదర్శి ఎంఏ షరీఫ్, ఉపాధ్యక్షులు కేవీవీ పరమేశ్వరరావు, కేఎస్ సుధాకరరాజు, బోను జయమ్మ, ఈఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

పన్నుల ఆన్‌లైన్ నమోదు వేగవంతం చేయాలి



విజయవాడరూరల్: గ్రామాల్లో ఇంటిపన్ను వివరాలను నెలాఖరు నాటికి ఆన్‌లైన్లో తప్పులేకుండా నమోదు చేయాలని విజయవాడ రూరల్ మండల డెప్యూటీ ఎంపీడీఓ ఎంవీడీ ప్రసాద్ అన్నారు. శుక్రవారం పాతపాడు, పి.నైనవరం, అంబాపురం గ్రామాల్లో జరుగుతున్న పన్నుల ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామ పంచాయతీల్లో ఇంటిపన్ను, నీటిపన్ను, గ్రంథాలయ సెస్ వివరాలను ఆన్‌లైన్ చేస్తున్నట్టు చెప్పారు. పాతపాడు గ్రామంలో 1,360 అస్సెస్‌మెంట్లకు గాను రూ.18.60 లక్షలు పన్నుల రూపంలో ఆదాయం వస్తుందన్నారు. పి.నైనవరం గ్రామంలో 1,163 అసెస్ మెంట్లకు గాను రూ.15.20 లక్షలు, అంబాపురం గ్రామంలో 1,740 అసెస్‌మెంట్లకు గాను రూ.42 లక్షలు ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. ఈ మూడు గ్రామాల్లో జరుగుతున్న ఆన్‌లైన్ వివరాలను డెప్యూటీ ఎంపీడీఓకి గ్రామ పంచాయతీ కార్యదర్శులు పి.కోటిలింగమ్మ, అజేంద్ర, డి.శ్రీనివాసరావు వివరించారు.

పలువురికి వైఎస్సార్ సీపీ సమన్వయకర్త పరామర్శ



గంగూరులో పార్టీ నాయకులతో మాట్లాడుతున్న చక్రవర్తి

పెనమలూరు: గంగూరు గ్రామంలో వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి శుక్రవారం పర్యటించారు. గ్రామంలో పార్టీ నేతలకు కలిశారు. గ్రామంలో పార్టీకి చెందిన పలువురు నేతల కుటుంబాలలో వివిధ కారణాలతో అనారోగ్యంతో ఉన్న వారిని పరామర్శించారు. గ్రామ పార్టీ నాయకుడు అజీజుల్లా ఖాన్ తల్లి ఇటీవల మరణించటంతో కుటుంబాన్ని పరామర్శించారు. కలపాల నిక్సన్ కుమారుడు అనారోగ్యంతో ఉండటంతో వారి ఇంటికి వెళ్లి ఆరోగ్య సమస్యలు తెలుసుకున్నారు. అనారోగ్యంతో ఉన్న ఎండీ సర్దార్‌ను కూడా పలకరించారు. ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదంలో గాయపడిన మాజీ ఎంపీటీసీ సభ్యురాలు కుసుమకుమారిని పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన రమేష్‌ను, ఇటీవల మరణించిన మరియమ్మ కుటుంబాన్ని పరామర్శించారు. గ్రామంలో వైఎస్సార్ సీపీ పెద్దలను మర్యాద పూర్వకంగా కలిసి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు చిట్టూరి సుబ్బారావు, పి.బాబూరావు, అబ్దుల్ గని, రహీమ్, ఎండీ షరీఫ్, అబ్దుల్ మోహిద్దీన్, రిజ్వాన్‌బేగ్, ముస్తాక్, జోసెఫ్, యేషయ్య పలువురు పాల్గొన్నారు.

మెయిన్‌రోడ్డులో డివైడర్ నిర్మాణానికి తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచి కాటూరి సరళ శ్రీనివాస్

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో ఆర్ అండ్‌బీ రోడ్డులో సెంటర్ డివైడర్ నిర్మాణానికి పంచాయతీ పాలకవర్గం తీర్మానించింది. శుక్రవారం నున్న గ్రామ సర్పంచి కాటూరి సరళ శ్రీనివాస్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఇటీవల గ్రామంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో గ్రామస్తులు డివైడర్ నిర్మాణం, సెంట్రల్ లైటింగ్, రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని కోరారు. ఆ మేరకు ఎమ్మెల్యే ఆ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అదే అంశాలకు ప్రాధాన్యత నిస్తూ సమావేశం తీర్మానం చేసింది. నున్న– పాతపాడు రోడ్డులో ఆక్రమణలు తొలగించాలని ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ, పోలీసు శాఖలను కోరుతూ సమావేశం కోరింది. గ్రామంలో ఫిల్టర్ బెడ్స్ ద్వారా మంచినీరు ఫిల్టర్ కానందున ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి స్లంప్ నిర్మాణం చేపట్టేందుకు, జగనన్న కాలనీలో రోడ్లు, వీధి దీపాలు ఏర్పాటుకు అంచనాలు తయారు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను కోరుతూ సమావేశం తీర్మానం చేసింది. ప్రధాన గ్రామంలో అంతర్గత రోడ్ల నిర్మాణానికి గ్రామ పంచాయతీ నిధులు రూ.25 లక్షలు కేటాయిస్తూ సమావేశంలో తీర్మానించారు. పలువురు పాలకవర్గ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి కోట సురేష్‌బాబు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న ట్రైనీ ఎస్ఐ ప్రశాంతి

హనుమాన్‌జంక్షన్ రూరల్: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని హనుమాన్ జంక్షన్ పోలీస్‌స్టేషన్ ట్రైనీ ఎస్ఐ ఎన్.ప్రశాంతి అన్నారు. స్థానిక సిద్ధార్థ విద్యాలయలో విద్యార్థులకు ఫోక్సో చట్టం, సైబర్ నేరాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. బాలికలతో అసభ్యంగా ప్రవర్తించటం, లైంగికంగా వేధించే వ్యక్తుల గూర్చి ధైర్యంగా తల్లిదండ్రులు లేదా ఉపాధ్యాయులకు తెలియజేయాలని ట్రైనీ ఎస్ఐ ప్రశాంతి చెప్పారు. బాలికలకు రక్షణ కల్పించేందుకు పలు చట్టాలు ఉన్నాయని పేర్కొన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లను గూర్చి విద్యార్థినులకు వివరించారు. ఏఎస్ఐ కనకరాజు మాట్లాడుతూ ఇంటర్‌నెట్, మొబైల్స్ వినియోగం పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తులతో సామాజిక మాధ్యమాల ద్వారా స్నేహాలు చేస్తే చెడు కలిగిస్తుందని హెచ్చరించారు. వ్యక్తిగత విషయాలు, ఫొటోలను షేర్ చేయటం ప్రమాదకరమన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీరమాచినేని ధనలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పకడ్బందీగా సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధం

పటమట(విజయవాడతూర్పు): నగరంలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం ఎంజీరోడ్డులోని ఈట్ స్ట్రీట్, వేముల శ్యామలాదేవి రోడ్డు, కర్నాటి రామ్మోహన్ స్కూల్ వీధి, విశాలాంధ్ర రోడ్, బీఆర్టీఎస్ రోడ్, సీకే రెడ్డి రోడ్ ప్రాంతాల్లో పర్యటించారు. శాతవాహన కాలేజీలో ఉన్న నాలుగు పోలింగ్ స్టేషన్లను ఒకటి కర్నాటి రామ్మోహనరావు స్కూల్లో, మూడింటిని ఎస్ఆర్ఆర్ కాలేజీలో ఏర్పాటు చేసేందుకు ఏఈఆర్‌వోలు, సెంట్రల్ తహసీల్దార్ ప్రతిపాదించగా ఈ సందర్భంగా వాటిని ఆయన పరిశీలించారు. ఈట్ స్ట్రీట్‌లో నిరంతరం డీసిల్టింగ్ పనులను చేయాలని, పారిశుద్ధ్య నిర్వహణలో లోపం ఉండకూడదన్నారు. ఒకసారి వినియోగించి పడేసే ప్లాస్టిక్‌ను కచ్చితంగా నిషేధించాలని, ఇందుకు ప్రత్యేక ఎన్‌ఫోర్‌మెంట్‌ను బృందాలు నగరంలో విస్తృతంగా పర్యటించాలని అధికారులను ఆదేశించారు. కర్నాటి రామ్మోహన్ రావు స్కూల్ రోడ్లో పర్యటించి అక్కడ ప్రహరి సరిగా లేకపోవడంతో ఇంజినీరింగ్ అధికారులు ఆ గోడను పునర్నించాలని, స్థానికంగా ఉన్న భవన నిర్మాణ వ్యర్థాలను అక్కడి నుంచి తరలించాలని అధికారులను ఆదేశించారు. విశాలాంధ్ర రోడ్డులో పర్యటించి నగర సుందరీకరణ లో భాగంగా డివైడర్లలో గ్రీనరీని పెంచాలని, రంగులు వేయాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో ఏఈఆర్వోలు, పర్యవేక్షణ ఇంజినీర్ ప్రాజెక్ట్ పి.సత్యకుమారి, సెంట్రల్ డెప్యూటీ తహసీల్దార్ సురేష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంటర్ విద్యార్థిని అదృశ్యమైన ఘటనపై కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లంబాడీపేటకు దంపతులకు ఇద్దరి సంతానం. వారి కుమార్తె(17) భవానీపురంలోని ఓ ప్రయివేటు కాలేజీలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతోంది. ఈ నెల 22వ తేదీ రాత్రి ఇంట్లో అందరూ భోజనాలు చేసిన తర్వాత నిద్రపోయారు. రాత్రి 11.30 గంటల సమయంలో నిద్రలేచిన మైనర్ తండ్రికి పక్కనే పడుకున్న కుమార్తె కనిపించలేదు. దీంతో బయటకు వచ్చి చూడగా బాలిక జాడ లేదు. బాలిక గతంలోనూ ఓ యువకుడితో వెళ్లిపోగా తీసుకువచ్చారు. ఈసారి కూడా అలాగే వెళ్లిపోయి ఉంటుందని అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తొలి శ్రావణ శుక్రవార పూజలు ప్రారంభం



పాత గన్నవరంలో శ్రీలక్ష్మీతిరుపతమ్మను దర్శించుకుంటున్న భక్తులు



యనమలకుదురులో చండీహోమం చేస్తున్న దాత నరసింహారావు దంపతులు



చినకంచిలో కామాక్షి అమ్మవారికి వరలక్ష్మి అలంకారం



రామవరప్పాడులో అమ్మవార్లను దర్శించుకుంటున్న భక్తులు

గన్నవరం: స్థానిక పాతగన్నవరంలో కొలువైన శ్రీలక్ష్మీతిరుపతమ్మ దేవస్థానంలో శ్రావణమాస ఉత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలుత కాసన్నేని బాబూరావు, బేబీసరోజిని దంపతులచే కలశస్థాపన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా తిరుపతమ్మ మాతృమండలి సభ్యుల కోలాట నృత్య ప్రదర్శన, డప్పువాయిద్యాల మధ్య భక్తులు గ్రామ పొంగళ్లతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం ఆలయ సంప్రదాయం ప్రకారం బీసీ సామాజిక వర్గాలకు చెందిన భక్తులచే మాను (మహాలక్ష్మి)కి తొలిపూజ నిర్వహించారు. అమ్మవారికి గ్రామ పొంగళ్లను సమర్పించారు. సాయంత్రం శ్రీలక్ష్మీ సహస్ర నామ పూజ, లక్ష్మీ అష్టోత్తరం, హనుమాన్‌చాలీసా పారాయణం జరిపారు. బీసీ వర్గాలకు చెందిన పెద్దలు అల్లాపురం శంకర్, పడమట సుబ్రహ్మణ్యం, ఈడే సుబ్బారావు, వీరస్వామి, మోదుగుమూడి వేణుగోపాలరావు, చిమట శ్రీనివాసరావు, ఆవుటపల్లి సారథి, సురేంద్ర, రంగారావు, జమలయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఆగస్టు ఒకటిన రెండవ శ్రావణ శుక్రవారం అమ్మవారి సంబరం జరుగుతుందని ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ తెలిపారు. గ్రామంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ప్రభబండ్ల ఊరేగింపుతో ఆలయానికి చేరుకుంటారని తెలిపారు.

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో శ్రీపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో శ్రావణ శుక్రవారం పూజలు నిర్వహించారు. మొదటి శ్రావణ శుక్రవారం సందర్భంగా శ్రీ పార్వతీదేవి అమ్మవారికి అభిషేకం చేశారు. అమ్మవారికి నూతన వస్త్రాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ నిర్మాణ దాత సంగా నరసింహారావు దంపతులు చండీహోమం నిర్వహించారు. భక్తులు సామూహిక కుంకుమార్చన అత్యంత వైభవంగా చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈవో ఎస్.భవాని, ఆలయ ప్రధాన అర్చకుడు జీఆర్‌వీ సాగర్ పాల్గొన్నారు.

వెంకమ్మ, పేరంటాలమ్మ ఆలయంలో..

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో శుక్రవారం నుంచి శ్రావణమాస విశేష పూజలు ప్రారంభమయ్యాయి. భక్తులు వేకువ జాము నుంచే ఆలయానికి తరలివచ్చారు. ముగ్గురమ్మలను దర్శించుకుని విశేష పూజలు ఆచరించారు. భక్తులు పాల పొంగలి చేసి అమ్మవార్లకు సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి పి.ప్రియాంక మాట్లాడుతూ శ్రావణమాస తొలి రోజు సందర్భంగా అమ్మవార్లను రకరకాల పుష్పాలతో అలంకరించి కుంకుమార్చన, అష్టోత్తర పూజలు నిర్వహించినట్లు తెలిపారు. వచ్చే నెల 23 వరకూ ప్రతి రోజూ విశేష పూజలు నిర్వహించనున్నట్లు వివరించారు. పరోక్షంగా అమ్మవార్లకు పూజలు నిర్వహించదలచే వారు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. మాసాంతరమున అమ్మవారి ప్రత్యేక ప్రసాదము, కుంకుమ, అక్షింతలు పోస్టు ద్వారా అందజేస్తామని తెలిపారు.

వరలక్ష్మీదేవికి విశేష పూజలు

నున్న(విజయవాడరూరల్): నున్న, పరిసర గ్రామాల్లోని దేవాలయాల్లో తొలి శ్రావణ శుక్రవారం పూజలు అభిషేకార్చనలు నిర్వహించారు. నున్న గ్రామంలో చినకంచి నందు శ్రీకామాక్షి అమ్మవారికి విశేషంగా వరలక్ష్మీదేవిగా అలంకారం చేసి ప్రతిష్ఠించి వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. ప్రత్యేక అభిషేక అర్చనలు చేశారు. అనంతరం ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవాలయంలో అష్టలక్ష్మిలకు అభిషేక అర్చనలు నిర్వహించారు. 3వ శుక్రవారం సువాసినిలచే వరలక్ష్మి వ్రతాలు నిర్వహిస్తామని దేవస్థానం ట్రస్టీ మొక్కపాటి శర్మ తెలిపారు. శ్రీకనకదుర్గమ్మ దేవస్థానంలో శ్రావణ శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక అలంకారం చేసి మహిళలు పూజలు నిర్వహించారు. దేవదాయశాఖకు చెందిన శ్రీ కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు అర్చనలు చేశారు. శ్రీచక్రనానికి కుంకుమపూజలు చేశారు. శ్రీరామలింగేశ్వరస్వామి, శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానంలో కూడా పూజలు జరిగాయి. పి.నైనవరం గ్రామంలో నాగేంద్రస్వామి దేవస్థానం, అంబాపురం గ్రామంలో శ్రీకనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో పూజలు జరిగాయి.

నాడు మీటర్లు పగలగొట్టండన్నారు.. ఇప్పుడు మీరే ఏర్పాటు చేస్తారా?

పెనమలూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ భారం మరింత మోపటానికి ఏర్పాటు చేయిస్తున్న స్మార్ట్ మీటర్లపై పోరాటం చేస్తామని మండల సీపీఎం కార్యదర్శి షేక్ కాశిం హెచ్చరించారు. యనమలకుదురులో శుక్రవారం జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో నారా లోకేష్ స్మార్ట్ మీటర్లు ఇళ్లకు పెడితే పగులకొట్టాలని పిలుపుని చ్చారన్నారు. తీరా లోకేష్ మంత్రి అయిన తరువాత స్మార్ట్ మీటర్లు పెట్టిస్తున్నాడని మండిపడ్డారు. అదానిని కుబేరుడిని చేయటానికి రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు పెడుతుందని ఆరోపించారు. స్మార్ట్ మీటర్లు పెడితే ప్రజల మద్దతులో పోరాటం చేస్తామన్నారు. సీపీఐ నాయకుడు మోతుకూరి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అంబానీ, అదానీల కోసం పని చేస్తోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం అడుగులకు మడుగులు ఒత్తుందని ఆరోపించారు. స్మార్ట్ మీటర్లపై చేపట్టబోయే పోరాటానికి ప్రజలు మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నేతలు ఎస్‌కే బాబు, పి.మాధవి, వలీమా, వి.ఇజ్రాయిల్, పి.పాపారావు, పలువురు పాల్గొన్నారు.

కౌలు రైతుల రుణ సమస్య పరిష్కారం

ఆత్కూరు(గన్నవరం): ఉంగుటూరు మండలం ఆత్కూరుకు చెందిన కౌలు రైతుల సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. నలుగేళ్ల క్రితం ఆత్కూరు పీఏసీఎస్‌లో జరిగిన ఆర్థిక అవకతవకల కారణంగా లావాదేవీలు స్తంభించాయి. దీంతో గ్రామానికి చెందిన జేఎల్‌జీ గ్రూపు సభ్యులు ఐదుగురు తీసుకున్న రుణాలు తిరిగి చెల్లించలేదు. ఇటీవల ఒక్కొక్క సభ్యుడు తీసుకున్న రూ. లక్ష రుణానికి, మరో రూ.లక్ష వడ్డీ కలిపి మొత్తం రూ.2 లక్షలు చెల్లించాలని కేడీసీసీ బ్యాంక్ అధికారులు నోటీసులు పంపించడంతో కౌలు రైతులు ఆందోళనకు గురయ్యారు. ఈ విషయమై కౌలు రైతు సంఘ నేతలు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీని కలిసి సమస్యను వివరించారు. స్పందించిన కలెక్టర్ సమస్యను పరిష్కరించాలని కేడీసీసీ అధికారులను ఆదేశించారు. తేలప్రోలు కేడీసీసీ బ్రాంచ్‌కు శుక్రవారం వచ్చిన ఆ బ్యాంక్ ఏజీఎం శ్రీనివాసరావు కౌలు రైతు సంఘ నేతలు టీవీ. లక్ష్మణస్వామి, ఆజ్మీరా వెంకటేశ్వరరావు, గ్రూపు సభ్యులతో చర్చించారు. చివరికి రుణం నగదుతో పాటు 7 శాతం బారువడ్డీతో తిరిగి చెల్లించేందుకు అధికారులు అంగీకరించడంతో చర్చలు ఫలించాయి. రుణం చెల్లింపుల తర్వాత సదరు గ్రూపు సభ్యులకు రూ.1.50 లక్షల వరకు కొత్తగా రుణం మంజూరు చేసేందుకు కూడా ఏజీఎం ఒప్పుకున్నట్లు కౌలు రైతు సంఘ నేతలు తెలిపారు.

రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో రహదారుల అభివృద్ధికి సీఆర్‌డీఏ నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ ఆటోనగర్ టెర్మినల్ బందరు రోడ్డు నుంచి బల్లెంవారి వీధి ఎనికేపాడు వరకు డివైడర్, సెంట్రల్ లైటింగ్‌తో రోడ్డు నిర్మాణానికి రూ.68 కోట్లు మంజూరు చేశారన్నారు. గంగూరు నుంచి సాలిపేట వరకు పంట కాలువ రోడ్డుకు రూ.6.20 కోట్లు, మహానాడు రోడ్డు నుంచి కానూరు మీదగా పోరంకి నిడమానూరు రోడ్డు నిర్మాణానికి రూ.30 కోట్ల నిధులు మంజూరు చేసి టెండర్లు పిలిచారన్నారు. నిధులు మంజూరు చేసినందుకు మంత్రి పి.నారాయణకు ఎమ్మెల్యే ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు.

రక్తదానం మహాదానం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రక్తదానం మహాదానం అని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ అన్నారు. కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యాన రక్తదాన కార్యక్రమాన్ని శుక్రవారం కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు.